ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
terms and conditions apply

మంగళవారం 04-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక : 47 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## రెండేళ్లలో భారీ అప్పులు



2 లో

- రూ.1.69 లక్షల కోట్లు
- పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి
- మార్కెట్ నుంచే అధిక రుణాలు
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రస్తావన
- అప్పులు రాష్ట్ర బాధ్యతే

## ఉద్యోగ హామీలు ఎక్కడ?

- రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు
- విద్యార్థులపై కేటీఆర్ సందేహం
- నిరుద్యోగులపై కాంగ్రెస్ ఫెయిల్
- యూత్ డిక్లరేషన్ అమలేదే?
- రాహుల్‌కూ కేటీఆర్ ప్రశ్నలు
- రెండు లక్షల ఉద్యోగాల డిమాండ్



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (ఇది కద నిజం):** కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, నెరవేర్చని హామీల వల్ల తెలంగాణలో నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ ఊదరగొట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని దుయ్యబట్టారు. ఉద్యోగాలు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనని స్పష్టం చేశారు.

**నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?**

"హైదరాబాద్లోని అశోక్ నగర్ నడిబొడ్డున రాహుల్ గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

2 లో

## కేబినెట్ షాక్‌తో కాంగ్రెస్‌లో తిరుగుబాటు

- మంత్రి పదవి రాక ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా
- చివరి నిమిషంలో జాబితా మారిందన్న ఆరోపణ
- విధేయతకు విలువ లేదంటూ పాటిల్ ఆవేదన
- మద్దతుదారుల నిరసనతో బెంగళూరులో ఉద్రిక్తత
- పార్టీ మారను.. ఆత్మగౌరవమే ముఖ్యమన్న ఎమ్మెల్యే
- కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం
- అసంతృప్త నేతలతో డీకే సర్కార్‌కు కొత్త తలనొప్పి

2 లో

## అసెంబ్లీకి కొత్త రూపు

- రెండు అంతస్తుల ప్రతిపాదన
- కొత్త చాంబర్లకు రూపకల్పన
- భవన సామర్థ్యంపై పరీక్షలు
- కానిస్టిట్యూషన్ క్లబ్ నిర్మాణం
- స్పీకర్‌కు అధికారిక నివాసం



2 లో

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (ఇది కద నిజం):** అసెంబ్లీ భవనంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అసెంబ్లీ భవన విస్తరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలకు అనువుగా నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది కాలం క్రితం అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్పీకర్, చైర్మన్, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లకు చాంబర్లకు ఇబ్బందిగా మారింది. మంత్రుల చాంబర్లు ఇరుకుగా ఉన్నాయని, వీటిని మరికొంత విస్తరించాలని నిర్ణయించారు.

## రంగంలో మాతంగి హెచ్చరికలు

- విగ్రహ ప్రతిష్ఠ ఆలస్యంపై ఆవేదన
- వర్షాలు, అగ్ని ప్రమాదాలపై హెచ్చరికలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ పెట్టాలని పిలుపు
- భావోద్వేగంతో కంటతడి పెట్టిన స్వర్ణలత

2 లో

## బీజేపీ నాయకత్వానికి పీకే సూచనలు

- బంకీపూర్ ఫలితంతో ప్రజల సందేశం స్పష్టమన్న పీకే
- బిహార్‌కు సమర్థ సీఎంను ఎంపిక చేయాలని సూచన
- విద్య, ఉపాధికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి
- వలసలు తగ్గేలా అభివృద్ధి ప్రణాళికలు అవసరమన్న వ్యాఖ్య
- కుల, మత రాజకీయాలకు స్వస్తి పలకాలన్న పిలుపు
- బిహార్‌పై గుజరాత్ తరహా దృష్టి పెట్టాలని డిమాండ్
- మార్పు కోరుకుంటున్న ప్రజల సంకేతమిదే: ప్రశాంత్ కిశోర్

2 లో

## హైడ్రా తరహాలో మరో సంస్థ



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (ఇది కద నిజం):** రాష్ట్రంలో హైడ్రా తరహాలో టీజీ సేఫ్ (Telangana Safety Authority of Food And Essential Drugs)పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఆ సంస్థ హోటల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్స్‌లో వినియోగదారులకు సరఫరా చేసే ఆహార పదర్థాలతో పాటు మెడికల్ షాపుల్లో ప్రజలకు విక్రయించే మందులను తనిఖీ చేయనున్నది. అందుకోసం ఇప్పటివరకు విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ సంస్థలను విలీనం చేయనున్నారు. అలాగే ఐజీ ర్యాంకు అధికారిని నియమించడం, కావాల్సిన ఫీల్డ్ స్టాఫ్‌ను సమకూర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. సంస్థ ఏర్పాటుపై లీగల్ ప్రాబ్లమ్స్ రాకుండా ఉండేందుకు కావాల్సిన చట్ట సవరణలు చేసే పనిలో అధికారులు ఉన్నారు.

ప్రజా ఆరోగ్యంపై ఫోకస్


ఈ మధ్య వివిధ శాఖల్లోని విజిలెన్స్ విభాగాల పనితీరుపై సీఎం సమీక్ష చేసిన సమయంలో ఖరీదైన హోటల్స్, రెస్టారెంట్స్, పబ్స్‌లో అందిస్తోన్న ఆహారంపై చర్చ జరిగింది.

మిగతాది 2 లో..

- హోటళ్లపై ఇక సేఫ్ నిఘా
- ఆహారం-మందులపై ఒకే అథారిటీ
- కల్తీపై కఠిన కంట్రోల్
- ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం
- ఫుడ్, డ్రగ్స్ విభాగాల విలీనం
- ఐజీ స్థాయి అధికారికి బాధ్యతలు
- రెగ్యులర్ తనిఖీలకు ప్రత్యేక బృందం
- కల్తీకి చెక్.. నాణ్యతకు గ్రీన్ సిగ్నల్

## సుప్రీంకోర్టు విస్తరణకు పార్లమెంట్ ఆమోదం

- 38కి జడ్జిల బలం
- లోక్‌సభ గ్రీన్ సిగ్నల్
- కేసుల భారానికి చెక్
- ఏడేళ్ల తర్వాత విస్తరణ
- నలుగురు జడ్జిలకు దారి



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (ఇది కద నిజం):** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, బాధితులకు వేగంగా న్యాయం అందించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు పార్లమెంట్ లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఆరంభించారు.

2 లో

## 'జంతర్ మంతర్'కు గుడ్ బై

- కొత్త వేదికపై కసరత్తు
- సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- స్థానికుల ఇబ్బందులపై విచారణ
- కేంద్రానికి నోటీసులు జారీ
- కొత్త ధర్నా స్థలంపై చర్చ



2 లో

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (ఇది కద నిజం):** దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రధాన నిరసన వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద ధర్నాల వల్ల స్థానికులకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జంతర్ మంతర్‌కు బదులుగా మరొక అనువైన ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని కేటాయించే అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు పొందాలని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది.

## అరెస్టులపై జగన్ ఆగ్రహం



2 లో

- రాత్రి దాడులు పోలీసు రాజ్యానికి నిదర్శనమన్న జగన్
- సాక్ష్యాల మాయం ప్రయత్నమా? అంటూ ప్రశ్న
- మాజీ నేతలపై కేసుల నమోదుపై విమర్శలు

## కేంద్ర ఉద్యోగులకు తీపికబురు




2 లో

- ప్రస్తుతం 60% డీఏ.. 63%కు పెరిగే అవకాశం
- ఏఐసీపీఐ సూచీ ఆధారంగా నిర్ణయం
- కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదురుచూపులు
- ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట
- జులై విడత డీఏ పెంపుపై కీలక అప్‌డేట్
- ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం
- కోటి మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం



# సుప్రీంకోర్టు విస్తరణకు పార్లమెంట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ వారిని రిక్వెస్ట్ చేయగా.. అయినా వినకపోవడంతో బిల్లుపై చర్చ లేకుండానే స్పీకర్ ఆమోదించారు. దీంతో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో సహా మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే ప్రతిపాదనకు దిగువ సభ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, గతంలో 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సీజేఐతో కలిపి 31 నుంచి 34కి పెంచారు. ఆ తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం మళ్లీ జడ్జిల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జడ్జీల సంఖ్య పెరిగింది ఇలా..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సవరించడం.. పెంచే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. 1950లో రాజ్యాంగం అమలుల్లోకి వచ్చినప్పుడు సీజేఐతో సహా మొత్తం 8 మంది జడ్జిలు మాత్రమే ఉండేవారు. ఆ తర్వాత 1956లో సంఖ్య 10కి, 1960లో 13కు, 1977లో 18కి, 1986లో 26కు, 2009లో 31కి, 2019లో 34కు, 2026లో ప్రస్తుతం సీజేఐతో కలిపి 37 మంది జడ్జిలు ఉన్నారు. అయితే, సుప్రీంకోర్టులో ప్రస్తుతం వేలాది రాజ్యాంగ, సివిల్, క్రిమినల్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యాంగ ధర్మాసనాలు (Bench) సక్రమంగా నిర్వహించడానికీ, రోజువారీ విచారణలను వేగవంతం చేయడానికీ ఈదనంగా మరో నలుగురు న్యాయమూర్తుల నియామకం ఎంతో దోహదపడుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# 'జంతర్ మంతర్'కు గుడ్ బై

మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం సహా సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

పిటిషనర్ ప్రధాన వాదనలు..

సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ప్రస్తుతం జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అవసరమైన మురుగునీటి పారుదల, ఆహారం తదితర ప్రాథమిక సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ధర్నాలు జరగడం వల్ల స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర వైద్య సేవలు, సరుకుల సరఫరాకు ఆటంకం కలుగుతోందనీ పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిరసనల సమయంలో ప్రాంతంలోకి రావడం, వెళ్లడం కష్టంగా మారుతోందని తెలిపారు.

కోర్టు వ్యాఖ్యలు..

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, "రాకపోకలు, అత్యవసర వైద్య సేవల సరఫరాకు సంబంధించి పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ముఖ్యమైనవి. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన సూచనలు తీసుకోండి అని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించారు. విచారణ సమయంలో రాజకీయ నాయకులు పిలుపునిచ్చిన ర్యాలీలు, గత సంఘటనలను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా, రాజకీయ నిరసనలపై స్పందించేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఆయా వ్యవహారాలను ఎలా సరిదిద్దాలో శాంతిభద్రతల యంత్రాంగానికి తెలుసని వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వేరుగా విచారించేందుకు జాబితా చేసింది.

# కేబినెట్ షాక్‌తో కాంగ్రెస్‌లో తిరుగుబాటు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వేళ పార్టీ అధిష్ఠానానికి ఊహించని షాక్ తగిలింది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి కొద్ది గంటల ముందు కేబినెట్‌లో చోటు దక్కలేదని తీవ్ర తీవ్ర అసంతృప్తికి గురైన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ వి. పాటిల్, సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

క్షణాల్లో మారిన జాబితా.. అసంతృప్తిలో నేతలు

ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్ విధాన సౌధలో డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిని కలసి తన రాజీనామా లేఖను సమర్పించారు. పాటిల్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన మద్దతుదారులు బెంగళూరులో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు సాగర్ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ కూడా అసెంబ్లీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. రాజీనామా అనంతరం యశ్వంతరాయగౌడ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నేడు ఉదయం వరకు విడుదలైన జాబితాలో నా పేరు ఉంది, నాకు అధికారిక సమాచారం కూడా వచ్చింది. కానీ చివరి నిమిషంలో ప్రకటించిన ఆఖరి జాబితాలో నా పేరు కనిపించలేదు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైంది. విధిలేని పరిస్థితుల్లోనే రాజీనామా సమర్పించాను. కాంగ్రెస్ పార్టీలో విధేయతకు, నిజాయితీకి విలువ లేకుండా పోయింది."

పార్టీ మారట్లేదు కానీ ఆత్మగౌరవం ముఖ్యం

తాను పదవుల కోసం ఆరాటపడటం లేదని, 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని పాటిల్ గుర్తుచేశారు. "ప్రభుత్వం ఏర్పడిన సమయంలో రెండున్నరేళ్ల తర్వాత కేబినెట్‌లోకి తీసుకుంటామన్నారు, కానీ ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఇప్పటివరకు 8 ఎన్నికలు ఎదుర్కొన్న పరిణతి చెందిన రాజకీయనాయకుడిని నేను. ఇది నా నియోజకవర్గ ప్రజలకు జరిగిన అవమానం. నేను పార్టీని వీడటం లేదు, కానీ రాజీనామా చేసే వాతావరణాన్ని వాళ్లే కల్పించారు" అని పేర్కొన్నారు.

కేబినెట్ విస్తరణ నేపథ్యం

డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత ఈ కేబినెట్ విస్తరణ చేపట్టారు. కొత్తగా కేబినెట్ లోకి తీసుకున్న 20 మంది మంత్రులు బెంగళూరులోని లోక్ భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. ఈ విస్తరణలో స్థానం దక్కని పలువురు సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొందరు కార్పొరేషన్ చైర్మన్ పదవులకు కూడా రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు కర్ణాటక కాంగ్రెస్ సర్కారులో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేశాయి.

# కేంద్ర ఉద్యోగులకు తీపికబురు




**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న 8వ పే కమిషన్ వేతన పెంపునకు సంబంధించి కీలక అప్‌డేట్ రానే వచ్చింది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు కేంద్రం ప్రతి ఏటా రెండుసార్లు ఉద్యోగులకు కరువు భత్యం రూపంలో వేతన పెంపును అందిస్తోంది. అందులో భాగంగా జులై విడతకు సంబంధించిన డీఏ పెంపుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయతే ఈ డీఏ పెంపును కార్మిక శాఖ విడుదల చేసే ఆలిండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ గణాంకాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈసారి వెలువడిన వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఉద్యోగులకు 3 శాతం డీఏ పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 60 శాతం డీఏను పొందుతున్నారు. ఇప్పుడు ప్రకటించబోయే 3 శాతం పెంపుతో డీఏ రేటు 60 శాతం నుంచి 63 శాతానికి చేరనుంది. కేంద్ర కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త వేతనాలు అమలుల్లోకి రానున్నాయి. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

# ఉద్యోగ హామీలు ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. నోటిఫికేషన్లు వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా 'ఎండ్రిన్ తాగి చావండి' అని మాట్లాడటం దారుణమన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డికే దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయని. ఆయనే అసలైన క్రిమినల్ వేస్ట్ అని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయం, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కనిపించడం లేదా అని నిలదీశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రేవంత్ విద్యార్హతపై అనుమానాలు..

"రేవంత్ రెడ్డి అసలు ఏం చదివారో కూడా నాకు అనుమానంగానే ఉంది. ఎవరి సహాయం లేకుండా ఆయన తన ఎన్నికల అఫిడవిట్ నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూ అయినా ఫేస్ చేశారా? అసలు విద్యార్థుల కష్టాలు, వారి శ్రమ రేవంత్ రెడ్డికి ఏం తెలుసు?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సంక్షోభం వచ్చినా, కేంద్రం నుంచి నిధులు ఆగిపోయినా నిరుద్యోగుల కోసం 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బీజేపీ నాయకత్వానికి పీకే సూచనలు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** బంకీపూర్ ఉప ఎన్నిక ఫలితంతో బిహార్ ప్రజలు బీజేపీ కేంద్ర నాయకత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారని జన సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్ అన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా మంచి వ్యక్తిని ఎంపిక చేయాలని, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. "బిహార్ ప్రజలు ఎన్డీయేకు 202 మంది ఎమ్మెల్యేలను ఇచ్చారు. ఆ బాధ్యతను నాయకత్వం సరిగ్గా వినియోగించాలి. నేర చరిత్ర ఉన్నవారికి కాకుండా, నిజాయితీగా పనిచేసే వ్యక్తికి నాయకత్వం ఇవ్వాలి" అని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. బిహార్‌లో విద్యా వ్యవస్థ మెరుగుపడాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలని ఆయన అన్నారు. గుజరాత్ అభివృద్ధిపై ఎంత శ్రద్ధ చూపుతున్నారో, 13 కోట్ల జనాభా ఉన్న బిహార్‌పైనా అంతే శ్రద్ధ చూపాలని కేంద్రాన్ని కోరారు. "బిహార్ పిల్లలు రూ.10-15 వేల జీతాల కోసం కుటుంబాలను వదిలి గుజరాత్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి మారాలి" అని ఆయన అన్నారు. కులం, మతం, ఉచిత రేషన్ అంశాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, అభివృద్ధి ఆధారంగా రాజకీయాలు సాగాలని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. "30 ఏళ్లుగా ఉన్న రాజకీయ కోట కేవలం 20 రోజుల్లో కదిలింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే సంకేతం ఇది" అని అన్నారు. బిహార్ భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో భారీ అప్పులు...రూ.1.69 లక్షల కోట్లు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ అప్పుల పై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్ లో స్పష్టత ఇచ్చారు. గత రెండేళ్ల కాలంలో (2024-25, 2025-26) ఏపీ ప్రభుత్వం మొత్తం రూ. 1,69,341 కోట్ల మేర అప్పులు చేసిందని వెల్లడించారు. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 82,855 కోట్లు రుణాలు తీసుకోగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 86,486 కోట్లను అప్పుగా సేకరించినట్లు ఆయన రాతపూర్వక సమాధానంలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం చేసిన రుణాల్లో మెజారిటీ భాగం ఓపెన్ మార్కెట్ ల్యాండింగ్స్ ద్వారానే జరిగినట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2024-25లో రూ. 78,205 కోట్లు, 2025-26లో రూ. 82,272 కోట్లను బహిరంగ మార్కెట్ నుంచే సేకరించారని వెల్లడించారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల నుంచి రూ. 900 కోట్లతో పాటు, 2025-26లో మరో రూ. 1,633 కోట్ల మేర రుణాలను ఏపీ ప్రభుత్వం సేకరించిందని సమాధానంలో వివరించారు.

పూర్తిగా ప్రభుత్వాల బాధ్యతే..

అప్పుల సమీకరణ, ఆర్థిక లోటును అదుపులో ఉంచుకోవడం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతేనని పంకజ్ చౌదరి స్పష్టం చేసింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అనుగుణంగానే రాష్ట్రాల రుణ పరిమితులు నిర్దేశించబడతాయని స్పష్టం చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి ఈ వివరాలను వెల్లడించారు.

# అసెంబ్లీకి కొత్త రూపు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** అసెంబ్లీ భవనంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అసెంబ్లీ భవన విస్తరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలకు అనువుగా నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది కాలం క్రితం అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్పీకర్, చైర్మన్, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లకు చాంబర్లకు ఇబ్బందిగా మారింది. మంత్రుల చాంబర్లు ఇరుకుగా ఉన్నాయని, వీటిని మరికొంత విస్తరించాలని నిర్ణయించారు. దీంతో అదనపు చాంబర్లు అవసరం అవుతాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న అసెంబ్లీ భవనం పైన రెండు ఫ్లోర్లను నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు.

భవనానికి సామర్థ్య పరీక్షలు..

అయితే ఇప్పుడున్న భవన సామర్థ్యం ఎన్ని ఫ్లోర్లు వేయడానికి అనువుగా ఉందనే విషయాన్ని సాంకేతికంగా పరీక్షలు చేసి నివేదిక ఇవ్వడానికి ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. శాసనసభ పక్ష కార్యాలయాల భవనాలు, ప్రింటింగ్ ప్రెస్ గదుల భవనాన్ని మొత్తం తొలగించి పబ్లిక్ గార్డెన్ వైపు మరికొంత స్థలాన్ని సేకరించి భారీ భవనాన్ని నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. ఇందులో శాసనసభ పక్ష కార్యాలయాలు, విప్‌ల చాంబర్లు, అధికారులు ఉండటానికి, వేచి ఉండటానికి, డైనింగ్ హాల్స్‌కు అనువుగా విశాలమైన భవనాన్ని నిర్మించనున్నారు. ఎగ్జిక్యూటివ్, పొలిటికల్ వారికి వేరు వేరుగా ఫ్లోర్లు ఉండేలా చూస్తున్నారు. కానిస్టిట్యూషన్ క్లబ్‌తో పాటుగా అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ నివాసగృహాలను నిర్మించాలని నిర్ణయించారు. స్పీకర్‌కు, చైర్మన్‌కు అధికారిక నివాసాలను నిర్మించడం, కానిస్టిట్యూషన్ క్లబ్‌ను అందులో నిర్మించాలని నిర్ణయించారు. విద్యార్థి, ప్రజా, కార్మిక, కర్షకులు, మహిళాలు ఇన్ని వర్గాల సమస్యలపై చర్చించేందుకు, సమావేశాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించేందుకు అనువుగా భవనాన్ని తీర్చిదిద్దనున్నారు.

# హైడ్రా తరహాలో మరో సంస్థ

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా కొన్ని హోటల్స్‌లో తనిఖీలకు వెళ్లిన అధికారులకు పెద్ద ఎత్తున కుళ్లిన మటన్, చికెన్‌ను గుర్తించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. అదే సమయంలో కల్తీ నూనెలు, వనస్పతి ఉపయోగిస్తున్నట్లు ఆధారాలు దొరికాయని అధికారులు వివరించారు. దీనితో రెగ్యులర్‌గా హోటల్స్, రెస్టారెంట్స్, పబ్స్, ఫుడ్ కోర్టులను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా ఓ విభాగం అవసరమని అభిప్రాయానికి సీఎం వచ్చినట్టు తెలిసింది. 'ప్రజలకు అందించే ఆహారం, మందులపై నిరంతరం నిఘా ఉండాలి. అప్పుడు కల్తీ లేని ఆహారం, నాణ్యమైన మందులు ప్రజలకు అందుతాయి. ప్రజారోగ్యంపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టేందుకుగా ఓ వింగ్ ఏర్పాటు అవసరం.'అని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. దీనితో ప్రస్తుతం మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందికి తీసుకురావాలని నిర్ణయం జరిగినట్టు అధికారులు వివరించారు.

రెండు విభాగాల మధ్య కొరవడిన సమన్వయం: మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలు విడివిడిగా పనిచేస్తున్నాయి. కానీ రెండు సంస్థల మధ్య సమన్వయం లేదు. అలాగే రెండు సంస్థలకు ఫీల్డ్‌లో కావాల్సిన స్టాఫ్ లేదు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి రెండు విభాగాలను విలీనం చేసి, ఒక కొత్త పేరును సంస్థకు పెట్టాలని అదేశించినట్టు తెలిసింది. దీనితో టీజీ సేఫ్ (Telangana Safety Authority of Food And Essential Drugs) పేరును ఖరారు చేసినట్టు సమాచారం. ఒక ఐజీ ర్యాంకు అధికారికి సంస్థ బాధ్యతలు అప్పగించి, కావాల్సిన స్టాఫ్‌ను పోలీసు శాఖ నుంచి డిప్యూటేషన్ ద్వారా తీసుకోవాలని భావిస్తున్నారు. అయితే రెండు సంస్థల ఏర్పాటు సెంట్రల్ యాక్టు ప్రకారం ఏర్పాటయ్యాయి. విలీనం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కావాల్సిన జాగ్రత్తలు తీసుకునే పనిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ రెండు రకాల పనులను ఒకే సంస్థ నిర్వహిస్తున్నది. అందుకోసం అక్కడి సంస్థల పనితీరు, అక్కడి చట్టాలను పరిశీలించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నది.

# రంగంలో మాతంగి హెచ్చరికలు



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు వేడుకల్లో భాగంగా రంగం, భవిష్యవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిగ్గా ఉదయం 9.55కు పచ్చికుండపై నిలబడి అమ్మవారు పూనిన మాతంగి స్వర్ణలత భవిష్యవాణిని చెప్పుకొచ్చారు.

ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలతో సంతృప్తి చెందావా.. అని ప్రధానార్చకులు ఆమెను ప్రశ్నించారు. అందుకు మాతంగి స్వర్ణలత సమాధానం చెప్పకుండా కాసేపు మౌనంగా ఉంది. మీ సమాధానం కోసం కోట్లాది మంది రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. దీంతో మాతంగి స్వర్ణలత 'నేను ఉత్సవాలకు సంతోషంతో రాలేదురా బాలక.. కోపంతో వచ్చాను. మీరు అడిగే ప్రశ్నలకు సమాధానం ఎందుకు చెప్పాలి? ఏటేటా మీరు పూజలు చేస్తున్నా.. అసంతృప్తితోనే సరిపెట్టుకుంటున్నా..! ఏ ప్రమాదాలు వచ్చినా.. నా బిడ్డలను కాపాడుకుంటూ వస్తున్నా. నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తానని మాట తీసుకుంటున్నారు.. మీరు మాత్రం నేను చెప్పింది ఆచరించట్లేదు' అని మాతంగి స్వర్ణలత పలికింది.

ఈ క్రమంలోనే ప్రధానార్చకులు ఆచరించట్లేదని కాదమ్మ.. వెసులుబాటు ఉండట్లేదని అన్నారు. అందుకు మాతంగి స్వర్ణలత 'విగ్రహ ప్రతిష్ఠకు ఎవరు అడ్డొచ్చినా.. ఊరుకోను!' అని హెచ్చరించింది. అనంతరం వర్షాలు, ఉపద్రవాల గురించి ప్రశ్నించగా.. 'ఈ ఏడాది వర్షాలు కుంభవృష్టిగా కురుస్తాయి.. జనం కొట్టుకుపోతారు, అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలిరా బాలక' అని చెప్పుకొచ్చింది. జనం వావివరుసలు లేకుండా ప్రవర్తిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఊరిమీద వదిలేస్తున్నారని మాతంగి స్వర్ణలత పలికింది. 'నా పట్ల అహంకారం ఎక్కువైనా.. ఈ ఏడు ఉత్సవాల విషయంలో నిరుత్సాహపరిచినా, మిమ్మల్ని కాపాడుతూనే ఉంటా' అని కంటతడి పెట్టింది. భక్తులు దోశడంత ఇస్తే గోరంత కూడా నాకు పెట్టడం లేదు, రాబోయే 6 నెలల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరక్కపోతే.. భారీగా ప్రాణనష్టం జరుగుతుంది.. నా ఉగ్రరూపం చూస్తారు' అని మాతంగి స్వర్ణలత పలికింది.

# అరెస్టులపై జగన్ ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 03 ఆగష్టు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార పార్టీ సాగిస్తున్న రాజకీయ కక్షసాధింపు చర్యలు, పోలీసుల అరాచకాలు ప్రజాస్వామ్యాన్నే హాస్యాస్పదం చేస్తున్నాయని.. అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడితే వారికి రక్షణ కల్పిస్తూ, దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమ కేసులు బనాయించడం ఏ రకమైన న్యాయం? ప్రజాప్రతినిధులు బాధితులకు అండగా నిలబడితే వారిపై కూడా కేసులు పెడుతూ, ప్రశ్నించిన వారి తలుపులు అర్ధరాత్రి బద్దలుకొట్టి అరెస్టులు చేయడం పోలీసు రాజ్యానికి పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటిపై అర్ధరాత్రి 2.45 గంటలకు భారీ పోలీసు బలగాలతో దాడి చేసి, తలుపులు పగలగొట్టి ఆయనను, ఆయన కుమారుడిని అరెస్టు చేసిన తీరు రాష్ట్రంలో చట్టబద్ధ పాలన లేదని స్పష్టం చేస్తోందని జగన్ పేర్కొన్నారు. బాధితుడిని పరామర్శించడానికి వెళ్లిన ఎమ్మెల్యేపై టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేస్తే, ఆ దాడి చేసిన వారిని వదిలేసి ఎమ్మెల్యే విరూపాక్షిపైనే హత్యాయత్నం కేసులు పెట్టడం ఘోరమని అన్నారు. ఈ అరాచకానికి సంబంధించిన దృశ్యాలు బయటకు రాకుండా ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్కులను పోలీసులు తీసుకెళ్లడం సాక్ష్యాలను మాయం చేసే ప్రయత్నం కాదా? అని ప్రశ్నించారు.

ఇది ఒక్క ఆలూరుకే పరిమితం కాలేదని ఆయన గుర్తుచేశారు. శ్రీకాకుళంలో ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అరెస్టు చేశారని, గుంటూరు ఈస్ట్ మాజీ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా వ్యాపార వివాదంలో ఉన్న వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తే, ఆయనపైనే కిడ్నాప్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. నాయకులు ప్రజల మధ్యకు వెళ్లినా, ప్రభుత్వాన్ని ప్రశ్నించినా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు.

నేటి 'Gen-Z' తరం డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ, మంత్రి లోకేష్ రాజీనామా, విద్యాదీవెన బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి గురించి నిలదీస్తుంటే... సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అరెస్టుల డ్రామాలు ఆడుతోందని జగన్ విమర్శించారు. "చంద్రబాబు గారూ... అధికారం, పోలీసు బలం ఎప్పటికీ శాశ్వతం కావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్ని అక్రమ కేసులకైనా, అరెస్టులకైనా భయపడేది లేదు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ అన్యాయాలపై మా పోరాటం తుదివరకు కొనసాగుతుంది" అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

# చౌదర్‌గూడెం నాయర పెట్రోల్ బంకులో కల్తీ ఇంధనం

## వాహనదారుల ఆందోళన.. అధికారుల తనిఖీలకు డిమాండ్



ఇది కద నిజం:షాద్‌నగర్ సమీపంలోని చౌదర్‌గూడెం గ్రామ పరిధిలో ఉన్న నాయర పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. బంకులో విక్రయిస్తున్న పెట్రోల్‌లో నీరు కలిసినట్లు ఓ వాహనదారుడు ఆరోపించడంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. బాధిత వాహనదారుడు తెలిపిన వివరాల ప్రకారం.. తన వాహనం కోసం బాటిల్‌లో కొంత పెట్రోల్ తీసుకెళ్లేందుకు బంకుకు వెళ్లాడు. సిబ్బంది బాటిల్‌లో పెట్రోల్ నింపిన అనంతరం అందులో నీటి మిశ్రమం ఉన్నట్లు అనుమానం కలిగిందని, పరిశీలించగా పెట్రోల్‌తో పాటు నీరు స్పష్టంగా కనిపించిందని వాపోయాడు. దీనికి సంబంధించిన దృశ్యాలను కూడా కొందరు స్థానికులు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నట్లు సమాచారం.ఈ ఘటనపై పలువురు వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాల్లో కల్తీ ఇంధనం పోస్తే ఇంజిన్ దెబ్బతినే ప్రమాదం ఉందని, మరమ్మతుల కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజల ప్రాణాలు, ఆస్తులకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై సంబంధిత పౌర సరఫరాల శాఖ, తూనికలు--కొలతల శాఖ, ఆయిల్ కంపెనీ అధికారులు తక్షణమే స్పందించి పెట్రోల్ నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత పెట్రోల్ బంకు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.వాహనదారులందరూ యజమాన్యాన్ని నిలదీయగా మాదే తప్పిదం జరిగిందని ఒప్పుకున్నట్లు సమాచారం. అధికారులు మరి ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..

# సామాజిక తెలంగాణ సంకల్ప సభ జయప్రదం చేయండి: మేడి నరేష్



ఇది కద నిజం,నకిరేకల్ నియోజకవర్గం: తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత తలపెట్టిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ కార్యక్రమం ఆగస్టు 6న రంగారెడ్డి జిల్లా లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుండి జరుగుతుంది. ఈ యొక్క సభను విజయవంతం చేయాలని నకిరేకల్ నియోజకవర్గ హెడ్ క్వార్టర్ లో నియోజకవర్గ ఇన్చార్జ్ మేడి నరేష్ పార్టీ నాయకులతో కార్యకర్తలతో పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జ్ మేడి నరేష్ మాట్లాడుతూ బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, మైనార్టీలకు అగ్రవర్ణాల పేదలకు నిజమైన సామాజిక తెలంగాణ సాధ్యపడాలంటే అది కల్వకుంట్ల కవిత తోటే జరుగుతుంది. అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను, మహిళలను, నిరుద్యోగ యువతను, రైతులను హక్కున చేర్చుకొని కల్వకుంట్ల కవిత కాపాడుకుంటుందని మేడి నరేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక ఏం మార్పు వచ్చిందని, సకల జనులంతా ఏమి కోల్పోయారని , ఏం చేస్తే స్వరాష్ట్ర స్వచ్ఛమైన పాలనలో సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు వస్తాయని తెలిపేందుకే ఈ సభ కార్యక్రమం ఉంటుందని అన్నారు, అదేవిధంగా స్వాతంత్రం వచ్చి నేటికి 80 ఏళ్లు పూర్తయిన విద్య, వైద్యం వ్యాపారం గానే కొనసాగుతుంది, రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఒక్క నోటిఫికేషన్ లేకుండా శాపంగా మారింది, తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ హక్కుల కోసం కొట్లాడేందుకు ప్రభుత్వంపై పోరాడేందుకు ఈ సభను విజయవంతం చేయాలని నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జ్ మేడి నరేష్ విజ్ఞప్తి చేశారు. ఈయొక్క కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు మరియు మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జ్ తెలంగాణ మాధవక్క, మండల నాయకులు ప్రేమ్, గిరి ప్రసాద్, సతీష్ నేత, నల్ల రేణుక, జ్యోతి, స్వప్న, నాగరాజు, రమేష్, ఆంజనేయులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణే లక్ష్యంగా మైసా బిల్డర్ అరాచకం

## బీజేపీ నేత నల్ల జై శంకర్ గౌడ్ తీవ్ర ఆగ్రహం



ఇది కద నిజం:పేట్ బషీరాబాద్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సర్వే నెం. 23 పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ మరియు హెచ్చరిక బోర్డులను మైసా బిల్డర్ అనుచరులు తొలగించడం అత్యంత దుర్మార్గమని, ఇది తీవ్రంగా ఖండించదగిన చర్య అని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి, అక్రమంగా ఏర్పాటు చేసిన దారిని మట్టితో మూసివేయడం అభినందనీయమని, అధికారుల ఈ తక్షణ స్పందన ప్రభుత్వ భూముల పరిరక్షణ పట్ల వారి నిబద్ధతను చాటుతోందని ఆయన ప్రశంసించారు. అయితే కేవలం తాత్కాలిక చర్యలతో సమస్య తీరదని, భవిష్యత్తులో ఇటువంటి ఆక్రమణలు, విధ్వంసక చర్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు హైడ్రా ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వ స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా, ఈ స్థలాన్ని స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా ఒక పార్క్‌గా లేదా ఇతర ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా వెంటనే అభివృద్ధి చేయాలని నల్ల జై శంకర్ గౌడ్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం

## - సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య



ఇది కద నిజం, కుక్కునూరు: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మడకం ఉంగా అధ్యక్షతన సోమవారం మండల కార్యవర్గ విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి లక్షల కుటుంబాలకు అండగా ఉందన్నారు. దేశంలో దున్నేవాడికే భూమి దక్కాలని కోరుతూ సీపీఐ సాగించిన పోరాటాల ఫలితంగా లక్షలాది ఎకరాలు సాగు భూములను పేదలకు అందడంలో చేసిన కృషి మరువలేనిదని ఆయన చెప్పారు. రైతాంగ సమస్యల పట్ల, కార్మిక హక్కుల పట్ల, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పట్ల, ప్రజా సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వ్యతిరేక విధానాలపై సీపీఐ అలుపెరగని పోరాటాలు చేసిందని కృష్ణచైతన్య గుర్తు చేశారు. 2014 నుంచి మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2024లో ఆంధ్రప్రదేశ్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దేశ, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. ఇచ్చిన హామీలను మరచి కేంద్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారమైన నిర్ణయాలతో పరిపాలన సాగిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలతో పాటు నిత్యవసర వస్తువులు సైతం పేద కుటుంబాలకు అందుబాటులో లేవన్నారు. ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని కృష్ణచైతన్ దుయ్యబట్టారు. వ్యాపారంలా మారిన విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధరకు సంబంధించి చట్టబద్ధత కల్పించాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషనను తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై అకృత్యాలను, దాడులను అరికట్టాలని కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. ఈనెల 6 నుంచి 15 వరకు పాదయాత్రలు, 17 నుండి 28 వరకు ప్రజాసంఘాల ప్రచార ఆందోళన అనంతరం సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ బాబు, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సహాయ కార్యదర్శి కురాకుల బాబురావు, మండల కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటా చారి, మడిపల్లి రమణయ్య, సోడే నాగేష్, కంగాల ఎర్రయ్య, పురేం వెంకట్, ఏకువ సోమరాజు, సోడే మారయ్య, కంగాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా భగ్నం

## - 450 కిలోల బియ్యం స్వాధీనం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పిట్లం గ్రామంలో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం పిట్లం గ్రామంలో దాడి నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 450 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పిట్లం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురుజాల రాకేష్ అనే కిరాణా వ్యాపారి ఇంటి ముందు నిలిపి ఉన్న బొలెరో వాహనం (టా17ఖ0934)ను తనిఖీ చేయగా, తొమ్మిది ప్లాస్టిక్ సంచుల్లో ఒక్కోటి 50 కిలోల చొప్పున మొత్తం 450 కిలోల పీడీఎస్ బియ్యం లభ్యమైంది. విచారణలో పిట్లం వారాంతపు అంగడిలో వివిధ గ్రామాల ప్రజల నుంచి కిలో రూ.20 చొప్పున ప్రభుత్వం పంపిణీ చేసే పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిట్లం ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మరియు వారి వెంట ఏఎస్ఐ రాచప్ప పోలీస్ సిబ్బంది ఉన్నారు




# పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై సర్పంచ్ సమీక్ష

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ సోమవారం సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమావేశమై ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రికి నూతనంగా విధుల్లో చేరిన వైద్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్లం గ్రామ ఉప సర్పంచ్ ఆవైజ్ బేగ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్, పార్టీ సీనియర్ నాయకులు అశోక్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు ఆదుకోండి

## కరోనా కాలం అద్దె మినహాయించండి
## రద్దు చేసిన షాపులను తిరిగి కేటాయించండి
## బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ వినతి



ఇది కద నిజం: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కొంగర కలాన్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సేవా అభివృద్ధి సంఘం (ఎస్సీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించి అద్దె దుకాణాలను కేటాయించారని తెలిపారు. అయితే 22 మార్చి 2020 నుంచి కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా విధించిన లాక్‌డౌన్ మరియు ఆర్థిక మాంద్యం వల్ల వ్యాపార కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో దుకాణాలు పొందిన యువత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 22 మార్చి 2020 నుంచి 22 మార్చి 2022 వరకు గల రెండు సంవత్సరాల అద్దె బకాయిలను పూర్తిగా మినహాయించాలని, అలాగే కరోనా ప్రభావం కారణంగా కోల్పోయిన వ్యాపార అవకాశాలను పరిగణనలోకి తీసుకుని అదనంగా రెండు సంవత్సరాల లీజు కాలాన్ని పొడిగించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా అద్దె బకాయిల పేరుతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ముఖ్యంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), కొంతమంది యువతపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అద్దె చెల్లించలేకపోయిన కారణంగా రద్దు చేసిన దుకాణాలను తిరిగి అదే లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు జీవనోపాధి హక్కుల పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నిరుద్యోగ ఎస్సీ యువతను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ శేర్లింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ పి. చిన్న, గద్ద రాజేశ్వర్, డి. దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొదటి సోమవారం సందర్భంగా రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం పట్టణంలోని రామేశ్వర ఆలయంలో ప్రతి నెల మొదటి సోమవారం సందర్భంగా పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ పూజారి గంగాధర్ పంతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శివయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహణ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని భవిత సెంటర్లో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ వి. సారిక విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఫిజియోథెరపీ సేవలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవిసింగ్, ఉపాధ్యాయుడు ప్రమోద్ కుమార్, ఐఈఆర్‌పీ ఎం. కమల్ కిశోర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.

# "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"ను విజయవంతం చేయండి

## రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు

## సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లు పరిశీలన





ఇది కద నిజం,హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన నిర్వహిస్తున్న "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"ను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు పిలుపునిచ్చారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లను పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. స్టేడియంలో వేదిక ఏర్పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తల సీటింగ్, స్టేడియంలో ఆవరణలో పార్కింగ్ సహా ఇతర ఏర్పాట్లను నాయకులు పరిశీలించారు. ఈనెల 6వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సహా పలువురు ప్రముఖులు పాల్గొని సామాజిక న్యాయ తెలంగాణ సాధన దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

### సబ్బండ వర్గాలకు కవితమ్మతోనే న్యాయం : టీఆర్ఎస్ నాయకులు

సబ్బండ వర్గాలకు కవితమ్మనే న్యాయం చేస్తారని తెలంగాణ రక్షణ సేన నాయకులు పేర్కొన్నారు. సోమవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం టీఆర్ఎస్ నాయకులు నరేశ్ ప్రజాపతి, కోల శ్రీనివాస్, ఎత్తరి మారయ్య మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అన్ని వర్గాలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం దక్కాలనే సంకల్పంతో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పని చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలనే ఉద్దేశంతో ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు కూడా శాసన మండలి, అసెంబ్లీ వైపు చూడని ఎన్నో కులాల గురించి శాసన మండలిలో కవిత ప్రస్తావించిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మనసు దోచిన 'యాలాలో'

వరుస పరాజయాల తర్వాత ఎలాగైనా సాలిడ్ హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నారు మాస్ మహారాజా రవితేజ. అందుకోసం ఆయన డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న సరికొత్త చిత్రం 'ఇరుముడి'. ఫీల్ గుడ్ సినిమాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన అప్డేట్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. రాబోయే ఆగస్టు 21న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో, సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ తాజాగా 'ఇరుముడి' చిత్రం నుండి రెండవ పాటను విడుదల చేశారు.

"యాలాలో యాలాలో వెన్నెట్లో ఎన్నెన్ని ముచ్చట్లో" అంటూ సాగే ఈ అందమైన పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ ఆకట్టుకునే సాహిత్యాన్ని అందించారు. ఈ పాటలో రవితేజ తన భార్య, చిన్నారి కూతురితో సరదాగా గడిపే సన్నివేశాలను చాలా బాగా చూపించారు. పాటలోని కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతోగానూ అలరిస్తున్నాయి. భార్యను బాత్‌రూమ్‌లో ఉంచి, చిన్నారి కూతురి సాయంతో రవితేజ రహస్యంగా మందు తాగే సన్నివేశం చాలా కామెడీగా ఉంది. ఆ తర్వాత రోడ్డుపై అరటిపండ్ల లోడుతో ప్రయాణిస్తున్నప్పుడు, రోడ్డుపై ఉన్న మేకలను బెదిరించమని భార్యకు చెప్తూ, మళ్లీ కూతురి సైగలతో చాటుగా మందు తాగడం సరదాగా చూపించారు. తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని, ప్రేమను కళ్లకు కట్టినట్లు చూపించిన తీరు సోషల్ మీడియాలో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆగస్టు 21న విడుదల కానున్న ఈ సినిమా రవితేజకు మంచి కంబ్యాక్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# సినిమా న్యూస్




# నాని బ్యానర్‌లో నితిన్

టాలీవుడ్‌లో ఒక క్రేజీ కాంబినేషన్ వినూత్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నితిన్ హీరోగా, నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో ఒక ఆసక్తికర చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవల 'కోర్ట్' సినిమాతో నిర్మాతగా బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్‌గా మారిన నాని, తన సొంత బ్యానర్ యూనానిమస్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం తాజాగా పూజా కార్యక్రమాలతో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నాని తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' లుక్‌లో కనిపించి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. 'అలియాస్ రుక్మిణి' టైటిల్‌తో రాబోతున్నట్లు వెల్లడించారు. అనంతరం మొదటి సన్నివేశానికి క్లాప్ కొట్టి సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. ప్రేమకథలు ఎప్పుడూ ప్రత్యేకమేనని, అయితే ఒక విభిన్నమైన నేపథ్యం, అద్భుతమైన నటీనటులు, నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు తోడైతే అవి చిరస్మరణీయంగా మారతాయని తెలిపారు.

ప్రియమైన నితిన్‌తో కలిసి మీ అందరికీ తప్పకుండా నచ్చేలా ఒక అద్భుతమైన చిత్రాన్ని అందిస్తున్నామని నాని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. వీడియోలో పెళ్లైన కొత్త జంట శోభనం గదిని, కొన్ని ఆసక్తికరమైన పుస్తకాలను చూపించారు. ఆ తర్వాత ఓ వ్యక్తి పూజ చేస్తుండగా.. వచ్చిన తన భార్య నా కోరిక తీర్చే వ్రతం లేదా అని అంటుంది. అప్పుడే వ్రతం వెంకన్న ఎవరు అని రాగా.. ఈ క్రమంలో నితిన్ ఉదయాన్నే నిద్రలేచి ఒళ్లు విరుస్తూ, కళ్లజోడు పెట్టుకుని నా భార్య రుక్మిణి అని చెబుతాడు. ఇందులో నితిన్ వ్రతం వెంకన్న అనే వైవిధ్యమైన పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ గ్లింప్స్‌కు నేచురల్ స్టార్ నాని ఇచ్చిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సరికొత్త కాంబినేషన్, కాన్సెప్ట్‌తో 'అలియాస్ రుక్మిణి' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# 'వారణాసి' కథ ఇదే!

దర్శకధీర ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించబోయే తదుపరి భారీ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ 'వారాణసి' గురించి సినీ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. తాజాగా ఈ చిత్రం యొక్క కథ, కథనం మరియు ప్రమోషనల్ వీడియోపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ సినిమా కథా నేపథ్యం ఏ రేంజ్‌లో ఉండబోతుందో వివరిస్తూ రాజమౌళి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. వారణాసి సినిమా ప్రయాణం వారణాసిలో ప్రారంభమై.. అక్కడి నుండి అంటార్కిటికా, ఆ తర్వాత ఆఫ్రికా ఖండం వరకు సాగుతుంది. అంతటితో ఆగకుండా కాలంలో వెనక్కి వెళ్తూ ప్రాచీన రోమ్ సామ్రాజ్యాన్ని తాకి.. చివరకు మళ్లీ తిరిగి వారణాసికి చేరుకుంటుంది.

సినిమా నుంచి విడుదల చేసిన ప్రమోషనల్ వీడియో గురించి స్పందిస్తూ.. మేము ఇప్పటికే ఒక టీజర్‌ను విడుదల చేశాం. కానీ అందులో కథను ఎక్కువగా రివీల్ చేయకూడదని అనుకున్నాను. ఎందుకంటే అంత పెద్ద కథను ఒక చిన్న టీజర్‌లో చూపించడం సినిమాకు న్యాయం చేయదు. అందుకే కథను బయటపెట్టకుండా ప్రేక్షకులు థియేటర్లలో ఎలాంటి అద్భుతమైన అనుభూతిని పొందబోతున్నారో తెలియజేసే విధంగా మాత్రమే ఆ వీడియోను రూపొందించాం' అని తెలిపారు. రాజమౌళి మాటలను బట్టి ఈ చిత్రం కేవలం ఒక ప్రాంతానికో లేదా దేశానికో పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్త పర్యటన, విజువల్స్ మరియు చారిత్రక అంశాలతో కూడిన భారీ అడ్వెంచర్‌గా ఉండబోతుందని స్పష్టమవుతోంది. రాజమౌళి విజన్, కథను నడిపించే తీరుపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 2027 ఏప్రిల్ 7న జక్కన్న ఎలాంటి విధ్వంసం చేస్తాడో చూడాలి.




# క్రైమ్ కామెడీకి కౌంట్‌డౌన్

లిటిల్ హార్ట్స్ ఫేమ్ మౌళి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దొంగ నా కొడకా'. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. పూర్తి స్థాయి రాబరీ క్రైమ్ కామెడీగా రూపొందుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు ఈ సినిమా విడుదల తేదీపై మేకర్స్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే మరికొన్ని రోజుల్లో విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ చిత్రంలో సుష్మితా శెట్టి, అలీ, రఘుబాబు, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్నారు.

